# "పరిసయ్యుల పులిసిన పిండిని గూర్చి జాగ్రత్త పడుడి"

## మత్తయి 23:1-39; మార్కు 12:38-40; లూకా 20:45-47, పరిశీలన

"పరిసయ్యులు సద్దూకయ్యులు అనువారి పులిసిన పిండిని గూర్చి జాగ్రత్తపడుడని" ఒకనాడు ప్రభువు తన శిష్యులతో చెప్పారు (మత్తయి 16:6).[1] మొదట్లో ఈ హెచ్చరికనుబట్టి శిష్యులు ఆశ్చర్యపోయారు. కాని కడకు "పరిసయ్యులు సద్దూకయ్యులు అనువారి బోధను గూర్చియే జాగ్రత్త పడవలెనని ఆయన తమతో చెప్పెనని వారు గ్రహించిరి" (మత్తయి 16:12).[2] మరియొక సమయంలో, "– పరిసయ్యుల వేషధారణ అను పులిపిండిని గూర్చి జాగ్రత్తపడుడి" అని వారిని ఆయన హెచ్చరించారు (లూకా 12:1).[3]

క్రీస్తు శత్రువులలో పరిసయ్యుల కంటె పట్టుదలగలవారు ఎవరూ లేరు. పరిసయ్యుల పాత్రలేని పాఠం మనకు అరుదుగా కన్పిస్తుంది. మాటిమాటికి, వారు ఎవరైయున్నారు,[4] వారు ఏమి నమ్మేవారు, వారు ప్రభువును ఎందుకు ద్వేషిస్తున్నారన్న విషయాన్ని గూర్చిన దృష్టికోణం కలుగుతూనే ఉంది. అయినా, మత్తయి 23లో ఏ లేఖన భాగము వారిని అంతగా బయటపెట్టదు. దానికి సంబంధించిన భాగాలు మార్కు లూకాల్లో ఉన్నాయి. వారి పులిసిన పిండి (ప్రభావాని)కి విరోధంగా తన శిష్యులను ప్రభువు ఎందుకు హెచ్చరించినట్టు? పరిసయ్యుల పులిపిండి వేషధారణయని ఆయన ఎందుకు అన్నారు? ఈ ప్రశ్నలకు పూర్తిగా జవాబు చెప్పాలంటే, మనం మత్తయి 23 చదవాలి.

ఈ అధ్యాయంలో కంటె కఠినమైన మాటలు ప్రభువు ఎక్కడను పలికియున్నట్టు లేదు. ఇప్పుడే మనం చదివిన పాఠంలో,[5] ఆయన అంత కఠినంగా ఎందుకు మాట్లాడవలసి వచ్చిందో ఆ కారణాల్లో కొన్నింటిని చూచాం. ఈ చర్చకు మరోకారణాన్ని చేర్చుతాను: నీకు, నాకు అది అవసరం గనుక అది భద్రం చేయబడింది. పరిసయ్యుల పాపాలతో, కొద్దిగా గాని గొప్పగా గాని, మానవ జాతియావత్తు పీడింపబడింది. పైగా, పరిసయ్యుల వలె, మనలో అనేకులు తమ బలహీనతలను ఎరుగని వారైయున్నారు. ప్రభువువారి "షాక్ ట్రీట్‌మెంట్" మనలో అనేకులకు మేలు కలిగించవచ్చు.

ఇతరులలో వేషధారణ గుర్తించడం సులభమే.[6] అది మనలో ఉన్నట్టు కనుగొనడం కష్టం. మత్తయి 23 మనం చదువుతుండగా, వ్యక్తిగతంగా వర్తింప జేసికొందాం.[7]

## వివరణ[8] (మత్తయి 23:1-12; మార్కు 12:38, 39; లూకా 20:45, 46)

దీని వెంట రాబోయే "అయ్యో" అనే వాటికి ముందు పూర్వగాధగా, క్రీస్తు జనసమూహములతోను శిష్యులతోను యిలా అన్నారు: "శాస్త్రులును పరిసయ్యులును మోషే పీఠమందు కూర్చుండువారు" (మత్తయి 23:2). ధర్మశాస్త్ర వివరణకు ప్రామాణికులుగా పరిసయ్యులు తమ్మును తామే నియమించుకున్నారు, ప్రజలచేత అలాటి గుర్తింపు పొందినవారు శాస్త్రులు పరిసయ్యులతో చేర్చబడ్డారు ఎందుకంటే శాస్త్రులలో ఎక్కువ మంది సభ్యులు పరిసయ్యుల తెగకు చెందినవారే.[9] "గనుక – వారు మీతో చెప్పువాటినన్నిటిని అనుసరించి గైకొనుడి" (మత్తయి 23:3ఎ). అంటే, "మోషే ఉపదేశంతో అంగీకారంగా ఉన్నంతవరకు వారు చెప్పినదంతయు గైకొని అనుసరించుడి." "అయినను వారి క్రియల చొప్పునచేయకుడి," వారు చెప్పుదురేగాని చేయరు (మత్తయి 23:3బి). "వారు చెప్పుదురేగాని చేయరు" అనే దానిలో ప్రభువు పరిసయ్యులను ఖండించే విషయం గోచరమౌతుంది. గతంలో అన్నట్టే, పరిసయ్యులు వేషధారణ విషయములో దోషులైయున్నారు (మత్తయి 23:13, 14, 15, 23, 25, 27, 29; లూకా 12:1 చూడు).[10]

"చెప్పి – చేయని" – పరిసయ్యుల జీవిత విధానాన్ని ఉదాహరణగా క్రీస్తు తెలిపారు: "మోయ శక్యముకాని భారమైన బరువులు కట్టి మనుష్యుల భుజముల మీద వారు పెట్టుదురే గాని తమ వ్రేలితోనైనా వాటిని కదిలింపనొల్లరు" (మత్తయి 23:4). ధర్మశాస్త్రమే మోయలేనిది (అపో. 15:10), దానితో పాటు భారభరితమైన వారి పారంపర్యాలను చేర్చారు (మార్కు 7:3). ఇతరుల మీద ధర్మశాస్త్రమును, పారంపర్యాచారాలను పెట్టి, తాము మాత్రం ధర్మశాస్త్రాన్ని కూడా అనుసరించకుండ తప్పించుకునే మార్గాలను వెదుకుతూ ఉంటారు.[11] "కొర్బాను" అంటూ, వృద్ధ తల్లిదండ్రులను లక్ష్యపెట్టని ఉదాహరణను మనం గతంలో చూచాం (మార్కు 7:11–13).[12] ఏ విధమైన మాటలతో ప్రమాణంచేస్తే బాధ్యత తొలిగిపోతుందో అనేదానికి మరో ఉదాహరణను ఈ లేఖన భాగంలో చూస్తాం (మత్తయి 23:16–22).

ఏది కాకపోయినా, అత్యంత భక్తిగలవారైయున్నట్టు యితరులచే అనిపించుకోవాలని పరిసయ్యులు కోరుతారు గనుక: "మనుష్యులకు కనబడు నిమిత్తము తమ పనులన్నియు చేయుదురు; తమ రక్షరేకులు వెడల్పుగాను" … (మత్తయి 23:5ఎ). "రక్షరేకులు" అంటే, "రక్షణను భద్రపరచు" అని అర్థం.[13] కొన్ని లేఖన భాగాలను పెట్టుకొనడానికి చిన్న (తోలు) చర్మపు పెట్టెలను యూదులు ఉపయోగించేవారు. వాటిది ఈ పేరు. ఈ చిన్న పెట్టలను చేతులకు, నుదుటికి కట్టుకునే వారు. మరియు వారు వీటిని తమ గుమ్మాలకు మేకులతో కొట్టేవారు. మానవ కల్పితమైన ఈ పారంపర్యాన్ని, ద్వితీయో. 6:8, 9కి అక్షరార్థమైన వ్యాఖ్యానంగా సూచించేవారు[14] (ద్వితీయో. 11:18–20 కూడా చూడు). ఈ పరిసయ్యులు "–యితరుల పెట్టలకంటే" వారు తమవాటిని పెద్దవిగా చేసికొంటారు.[15]

అదే విధానంలో, వారు "తమ చెంగులు పెద్దవిగా చేయుదురు" అని ప్రభువన్నారు

(మత్తయి 23:5బి). తాము ధర్మశాస్త్రమును జ్ఞాపకం చేసికొని గత జీవితానికి పోకుండునట్టు తమ బట్టల అంచులను "కుచ్చులు" చేసుకోవలసిందిగా మోషే ఇశ్రాయేలీయులకు తెలిపాడు (సంఖ్యా. 15:38, 39; ద్వితీయో. 22:12 చూడు).[16] జ్ఞాపకార్థమైన ఈ కుచ్చులను పరిసయ్యులు అందరికున్నవాటికంటె పెద్దవిగా చేసికొన్నారు.

శాస్త్రుల పరిసయ్యుల బాహ్య వేషా డంబానికి మరొక ఉదాహరణ మార్కు, లూకాల్లో ఉంది:[17] "వారు నిలువుటంగీలు ధరించుకొని తిరుగుటకు" యిష్టపడతారు (మార్కు 12:38; లూకా 20:46 చూడు). నేలను ఊడ్చేలా ఉండే నిలువుటంగీలు "ధనికులు పండితులు ధరించుతారు" (మార్కు 12:38; LB).[18]

ఈ మతనాయకులు ఆలాటి "షో" ఎందుకు చేస్తారు? మనుష్యుల ఘనతను సంపాదించడానికి "విందులలో అగ్రస్థానాలు" వారికి కావాలి (మత్తయి 23:6ఎ). విందు చేసేవానికి దగ్గరలో వారికి చోటు కావాలి (లూకా 14:7–11 చూడు). "సమాజమందిర ములలో అగ్రపీఠములు" వారికి కావాలి (మత్తయి 23:6బి). సమాజ కూడికకు ఎదురుగా లేచి చదివేవాని బల్ల వెనుక అర్ధ చంద్రాకారంలో ఉండేవి "అగ్రపీఠాలు."[19] "సంత వీధులలో వందనములను మనుష్యులచేత బోధకులని పిలువబడుటయు [వారు] కోరుదురు" (మత్తయి 23:7). "రబ్బీ, మహానుభావుడా" అనే బిరుదులతో మనుష్యులు వొంగి వారికి నమస్కరించడాన్ని వారు యిష్టపడతారు.

"రబ్బీ" అనే మాటతో మతసంబంధమైన బిరుదులను గూర్చి ప్రభువు క్లుప్తంగా చర్చించారు:

> మీరైతే బోధకులని పిలువబడవద్దు,[20] ఒక్కడే మీ బోధకుడు, మీరందరు సహోదరులు. మరియు భూమిమీద ఎవనికైనను తండ్రి అని పేరు పెట్టవద్దు; ఒక్కడే మీ తండ్రి; – ఆయన పరలోకమందున్నాడు. మరియు మీరు గురువులని పిలువబడవద్దు; క్రీస్తు ఒక్కడే మీ గురువు (మత్తయి 23:8–10).[21]

"ఉపదేశకుడు," "తండ్రి," లేక "నాయకుడు" అని ప్రజలచే పిలిపించుకొనవద్దని ప్రభువు చెప్పినప్పుడు, ప్రతిసందర్భంలోను ఆ పదాలను తప్పుపట్టలేదు. క్రొత్త నిబంధన "ఉపదేశకుని" పనిని గూర్చి చెప్పుతుంది (ఎఫెసీ. 4:11) లేదా "నాయకులను" గూర్చి ప్రస్తావించింది (హెబ్రీ. 13:17, 24). అంతే కాదు మీ తండ్రిని "తండ్రి" అని పిలవడంలో తప్పు లేదు (ఎఫెసీ. 6:2).[22] అయితే వీటిని మతసంబంధమైన బిరుదులుగా, తక్కిన వారికంటే తమ్మును హెచ్చించుకునే ప్రత్యేకమైన బిరుదులుగా ఉపయోగించ కూడదని ఆయన సూచించారు. "మీరందరు సహోదరులు" అని ప్రభువు నొక్కి పలికారు. గొప్ప అపొస్తలుడు సయితం కేవలం "సహోదరుడైన పౌలు" (2 పేతురు 3:15) మాత్రమే. జత పనికత్తె "ఫీబే అను మన సహోదరి" (రోమా. 16:1). ఈలాటి కుటుంబ సంబంధమైన పద జాలము ఏ క్రైస్తవునికైనా సరిపోవాలి.

# తప్పు మోపుట

## (మత్తయి 23:13-36; మార్కు 12:40; లూకా 20:47)

ఇది ప్రభువు పరిసయ్యులతో మాట్లాడే సమయం. ఆయన వారి వైపు తిరిగి "అయ్యో" అని ఎనిమిది సార్లు అన్నారు. వీటిలో ఏడు మత్తయిలోనే కన్పిస్తాయి. ప్రభువు మాటలు దాఖలు చేసిన మార్కు, లూకాలలో ఎనిమిదవది కన్పిస్తుంది.[23] "ఎన్నడూ మాట్లాడనంత భయంకరంగా" ప్రభువు ఆ సందర్భంలో పలికారు![24] ఈ సందర్భంలో ఆయన పరిసయ్యుల పాపాలను సంగ్రహం చేశారు.[25]

**పారంపర్యము** vs. **సత్యము (మత్తయి 23:13)**

మెస్సీయను గూర్చి ముందుగా తమకున్న మనోభావన - యేసును రాజుగా గుర్తించలేకుండ వారిని చేసింది. ప్రజలకు వారు బోధించిన ఆ భావాలే జనులు ఆయనను అంగీకరింపనీయకుండా చేశాయి.[26]

**ధనము** vs. **కనికరము (మత్తయి 23:14; మార్కు 12:40; లూకా 20:47)**

తమ అవసరతల విషయములో శ్రద్ధ చూపుతారని విధవరాండ్రు పరిసయ్యులను నమ్ముకొనినప్పుడు, వారు దాన్ని అవకాశంగా తీసికొని వారిని మోసంచేస్తూ వారి యిండ్లను దిగమింగాలనుకుంటారు.[27] విధవరాండ్రకు చేసే అన్యాయాన్ని దేవుడు నీచమైన పాపంగా పరిగణిస్తాడు (నిర్గమ. 22:22-24; ద్వితీయో. 27:19).

**గెలుపు** vs. **మతములో ప్రవేశింపజేయు (మత్తయి 23:15)**

అన్యజనులను యూదా మతంలోనికి కలుపుకొనడానికి తీవ్రంగా ప్రయత్నించేవారు (15 వ.).[28] విషాధకరంగా, దేవుని వైపుకు మనుష్యులను త్రిప్పేదానికి బదులు, పరిసయ్యులు జనులను పరిసయ్యులుగా చేయడంలోనే శ్రద్ధ చూపారు. తమ "తప్పు"డు నమ్మకాలను యితరుల మనుస్సుల్లోనికి చొప్పించగా, వారి "శిష్యులు పెద్దల పారంపర్యం" కొరకు రెండంతలు తీవ్రమైన ఆసక్తిని కనుపరచేవారు (మార్కు 7:3). ఆ విధంగా వారు "రెండంతల నరకపాత్రులై" యుంటారు[29] వారివలెనే.

**సౌకర్యము** vs. **బంధనము (మత్తయి 23:16-22)**

ప్రమాణాలను తేలికగా చేయకూడదు; వాటిని నిలబెట్టుకోవాలని పాతనిబంధన అంది (సంఖ్యా. 30:2). ప్రమాణం చేసినవాడు బాధ్యుడు కాకుండ ప్రమాణంచేయ సాధ్యమౌతుందని పరిసయ్యులు బోధించారు (మత్తయి 23:16, 18). ఈ రీజనింగ్‌లో ఉన్న దోషాన్ని ప్రభువు ఎత్తి చూపారు (17, 19-22 వచనాలు). గతంలో తన్ను

వెంబడించినవారికి ప్రభువు ఈ ఆదేశాలను యిచ్చినట్టు మనస్సులో ఉంచుకో: "నేను మీతో చెప్పునదేమనగా – ఎంత మాత్రము ఒట్టుపెట్టుకొనవద్దు; ఆకాశము తోడనవద్దు; అది దేవుని సింహాసనము, భూమి తోడనవద్దు, అది ఆయన పాద పీఠము" (మత్తయి 5:34, 35ఎ).

**ఎక్కువలు** vs. **తక్కువలు (మత్తయి 23:23, 24)**

మతాచారముల విషయములో పరిసయ్యులు బహు నిష్ఠగా ఉంటారు – తమ తోటలోని కూరమొక్కలలో నుండి సయితం వారు దశమ భాగం తీస్తారు.[30] అదే సమయంలో, వారి హృదయ స్థితిని వారు పట్టించుకోనివారై యుంటారు. వారు "న్యాయమును కనికరమును విశ్వాసమును విడిచిపె"ట్టారు (23ఎ వ.[31]; మీకా 6:8 చూడు).

"అంధులైన మార్గదర్శకు"లని ప్రభువు వారిని పిలిచారు వారు "దోమలేకుండు నట్లు,[32] వొడియ కట్టి ఒంటెలను మ్రింగువారు" (మత్తయి 23:24). ఇది తమాషాయైన పోలిక. తాము త్రాగు నీటిలో నుండి అశుద్ధమైన నలకలను తొలగించడానికి వడకట్టును వినియోగించి (లేవీ. 11:20, 23) అలాటి అశుద్ధమైన (అపవిత్రమైన) ఒంటెలను సహితం మింగడానికి వారు వెనుకాడరు (లేవీ. 11:4).[33]

23, 24 వచనాల్లో, కొందరు వాటిని "చిన్న"వని తలంచినా, దేవుని ఆజ్ఞలన్నిటికి లోబడాలనే మనస్సాక్షి కలిగియుండడం తప్పని ప్రభువు బోధిస్తున్నారా? తప్పక కాదు. "వాటిని మానక వీటిని చేయవలసియుండెను." తక్కువైనవి మానక "ఎక్కువైన"వాటిని చేయవలసియుంటుంది (మత్తయి 23:23బి).

**ఉపరితలము** vs. **ఆత్మ (మత్తయి 23:25-26)**

వెలుపల శుభ్రముగా ఉంచి లోపల అశుద్ధంగా ఉంచే గిన్నెలను క్రీస్తు ఉదాహరణగా ఉపయోగించారు (25 వ.; లూకా 11:39 చూడు). గిన్నెను లోపల శుద్ధం చేస్తే వెలుపలది కూడా శుద్ధమైయుంటుందని ప్రభువు సూచించారు (26 వ.). ఈ సారి గిన్నెలు కడిగేటప్పుడు దీన్ని చేయ ప్రయత్నించకు. ఆకారముతో ఉన్న గిన్నెల మీద అది పనిచేయదు. ఇది కేవలం హృదయాలకు వాస్తవమైనది. జీవితాలు అనే వాటిమీదనే పని చేస్తుంది!

**కన్పించేదానికి** vs. **వాస్తవానికి**

**(మత్తయి 23:27, 28)**

వెలుపల లోపల అనే వాటికి ప్రభువు మరొక తారతమ్యాన్ని ఉపయోగించారు:[34] పరిసయ్యులు "సున్నము కొట్టిన సమాధులను పోలియున్నారు, అని వెలుపల శృంగారముగా అగపడును గాని లోపల చచ్చినవారి యెముకలతోను సమస్త కల్మషముతోను నిండియున్నవి" (27 వ.). పరిసయ్యులు పైకి భక్తిగలవారివలె ఉంటారు

గాని "లోపల వేషధారణతోను అక్రమముతోను నిండియున్నారు" (28 వ.).

**అలంకార శాస్త్రం vs. నిజం (మత్తయి 23:29-36)**

పూర్వకాలపు ప్రవక్తలను పరిసయ్యులు గౌరవించినట్టును (29 వ.), వారు ప్రవక్తలను చంపిన తమ పితరుల వంటివారు కానట్టును (30 వ.;37 వ. చూడు) పరిసయ్యులు చూపించుకోగోరారు. వారు ఖచ్చితంగా తమ పితరులవలెనే ఉన్నారని ప్రభువు సూచించారు (31, 32 వచనాలను).[35] వాస్తవానికి, దేవుని ప్రతినిధులే, (36 వ) హింసించి చంపడానికి వారు బహు దూరంగా లేరు (34 వ.[36]). క్రీస్తు స్థాపించిన దానికి రుజువు కావాలని వారు కోరినట్టయితే, అదే గడియలలో వారు దేవుని కుమారుని చంపడానికి కుట్రపన్నడమే రుజువుగా ఉంది. దేవుని వర్తమానికుల పట్ల వారు చూపిన వైఖరినిబట్టి, గత తరములనుండి పోగుచేయబడిన తీర్పు అంతయు వారి మీదికి వస్తుంది. "ఇవన్నియు ఈ తరమువారి మీదికి వచ్చునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" అని ప్రభువన్నారు (35, 36 వ.; LB).

## విలాపము (మత్తయి 23:37-39)

రమారమి 2000 సంవత్సరాల క్రిందట పలుకబడినా, ప్రభువైన యేసు మాటలు యిప్పటికిని మన చెవులను గింగురుమనిపిస్తున్నాయి. అయినా, మరల నేను చెప్పే దేమంటే, తన శత్రువులను తప్పుపట్టడంలో క్రీస్తు ప్రభువుకు ఉన్నతమైన ఉద్దేశం ఏదీలేదని ఆయన ఉపయోగించిన కఠినమైన మాటలనుబట్టి తలంచకూడదు. స్నేహితులో లేక శత్రువులో - ప్రభువు ఎల్లప్పుడు తన శ్రోతల పట్ల అక్కర గలవారై యున్నారు - "ప్రభువు తాను ప్రేమించువారిని గద్దించును" అని బైబిలు అంటుంది (సామెతలు 3:12ఎ; హెబ్రీ. 12:6 చూడు).

యేసు పట్టణమునకు సమీపించినప్పుడు దానిని చూచి యేడ్చి (లూకా 19:41-44) యిలా అన్నారు, "యెరూషలేమా, యెరూషలేమా, ప్రవక్తలను చంపుచును నీ యొద్దకు పంప బడినవారిని రాళ్లతో కొట్టుచును ఉండుదానా" (మత్తయి 23:37ఎ).[37] గతంలో-యెరూషలేము దేవుని ప్రవక్తలను నిరాకరించింది. ఇప్పుడు అది మెస్సీయనే నిరాకరిస్తుంది. "కోడి తన పిల్లలను రెక్కలక్రిందికేలాగు చేర్చుకొనునో ఆలాగే నేనును నీ పిల్లలను ఎన్నోమారులు చేర్చుకొనవలెనని యుంటిని గాని మీరు ఒల్లక పోతిరి" (37బి).[38] "దేవుని పట్టణము"[39] దేవుని కుమారుని నిరాకరించింది - అది ఆయన హృదయాన్ని పగులగొట్టింది.

ఆ పట్టణపు హృదయ కాఠిన్యాన్ని బట్టి, దుర్భరమైన దినాలు ముందున్నాయి: "ఇదిగో మీ యిల్లు మీకు విడువబడియున్నది" (38 వ.). మీ "యిల్లు" అనేది దేవాలయాన్ని సూచించడానికి ఉపయోగపడింది.[40] రోమీయులచే[41] నలభై సంవత్సరాలలోపే - పట్టణంతోపాటు దేవాలయం కూడా నాశనం చేయబడనైయుంది. ఆ భయంకరమైన సంఘటన నిశ్చయమయ్యింది. క్రీస్తు మాట్లాడిన మాటలలోనే అది విదితమైయుంది.

ఏదికానప్పటికి, ప్రభువైన యేసు ఆ పట్టణాన్నీ ఆ జనాన్నీ యింకను ప్రేమించారు, ఆయనను అంగీకరించి తప్పింపబడవచ్చునని ఆయన వాధించారు.[42] ఆలాటి గాఢమైన కోర్కె ముగింపు పలుకులలో యిలా వ్యక్తపరచబడింది: "ఇది మొదలుకొని ప్రభువు పేరట వచ్చువాడు స్తుతింపబడును గాకని మీరు చెప్పువరకు నన్ను చూడరని మీతో చెప్పుచున్నాను" (39 వ.). 39వ వచనంలోని భాగము మెస్సీయ కీర్తన [కీర్తన 118][43] లోని 26వ వచనం నుండి కోట్ చేయబడింది. మెస్సీయ రాకతో కలిగే ఆనందాన్ని గూర్చి అది సూచించింది కొద్ది దినాలకు ముందు క్రీస్తు యెరూషలేములోనికి ప్రవేశిం చేటప్పుడు, పట్టణంలో ఆ మాటలు ప్రతిధ్వనించాయి (మత్తయి 21:9; మార్కు 11:9; లూకా 19:38; యోహాను 12:13). విషాదకరంగా, తన మాటల్లో గుప్తమైయున్న భావాన్ని ఆ పట్టణ వాసులు గ్రహించినవారు కారు. ప్రభువుగాను రక్షకునిగాను వారు తిరిగి "చూడ" గోరితే, వారు అదే పలుకులు తమ హృదయంలో నుండి పలుకవలసి యుంటుంది. యెరూషలేముకు ఉండిన ఏకైక నిరీక్షణ అదే.[44]

## ముగింపు

ఈ పాఠాన్ని మనం ముగింపుకు తెచ్చేటప్పుడు, మన లేఖన భాగము నుండి మూడు సత్యాలను గుర్తు చేసికొందాం:[45]

(1) దేవుడు వేషధారణను ద్వేషిస్తాడు. మనలో ప్రతి ఒక్కరం హృదయాన్ని పరీక్షించుకుందాం.

(2) దేవుడు విశ్వాసాన్ని కోరుతున్నాడు. "ప్రభువు పేరటవచ్చువాడు స్తుతింపబడును గాక" అని అర్థసహితంగా పలుకుదాం.

(3) దేవుడు విధేయతను కోరుతున్నాడు. మనలో ప్రతి ఒక్కరం వెంటనే స్పందించుదాం.[46] "కోడి తన పిల్లలను రెక్కలక్రింది కేలాగు చేర్చుకొనునో ఆలాగే నేనును నీ పిల్లలను ఎన్నో మారులు చేర్చుకొనవలెనని యుంటిని గాని మీరు ఒల్లక పోతిరి" అని మన విషయమై చెప్పకుండునట్లు చూచుకుందాం.

## నోట్సు

ఈ ప్రసంగానికి మరొక పేరు – "The Lord's Shock Treatment." ఈ ప్రసంగాన్ని ఈ విషయ పాఠాలతో నిరూపించవచ్చు: ఒక చిన్న పెట్ట, గిన్నెలు, వనమూలికలు, లేక ఒక కోడి, కోడిపెట్ట (similar to a phylactery ) 23, 24 వచనాల ప్రసంగం మీద ("ఒంటెలను కనిపెట్టి యుండండి") *The Day Christ Came (Again) and Other Sermons* (Dallas: Christian Publishing Co., n.d.).

## సూచనలు

[1]తన హెచ్చరికలో ప్రభువు సద్దూకయ్యులను హేరోదీయులను కూడా చేర్చారు (మత్తయి 16:6; మార్కు 8:15). అయితే యిందులో పరిసయ్యుల తెగను నొక్కి చెప్పారు. [2]కథను వివరముగా చెప్పాలి. "క్రీస్తు జీవితం, 3"లో చూడు. [3]"క్రీస్తు జీవితం, 4"లో వివరాలకు చూడు. [4]పరిసయ్యులను గూర్చిన సాధారణమైన వివరాలను యివ్వు. "క్రీస్తు జీవితం, 1" మరియు "క్రీస్తు జీవితం, 5"లోను చూడు. [5]"విజేత … మరియు యింకను ఛాంపియన్" అనే పాఠమును బైబిలు తరగతులలోను మరియు ఈ ప్రసంగం ఆరాధన సమయంలోను చేయవచ్చు. [6]ఇతురులలో ఉన్న వేషధారణ చూచుట సులభం, "విజేత … మరియు యింకను ఛాంపియన్" అనే పాఠములో దీన్ని గూర్చిన వివరాలను చూడు. [7]అన్వయింపును సరిగా చేయుము. [8]Warren Wiersbe, *The Bible Exposition Commentary,* vol. 1 (Wheaton, Ill.: Victor Books, 1989), 83-86. [9]ఎక్కువ వివరాలకు "క్రీస్తు జీవితం, 1"ను చూడు. [10]"వేషధారణ" అనే పదానికి అర్థం చెప్పు.

[11]"మాలోవున్న తప్పులను కనిపెట్టారు" అని చెప్పవచ్చు. [12]"క్రీస్తు జీవితం, 3"ను చూడు. [13]*The Analytical Greek Lexicon* (London: Samuel Bagster & Sons Ltd., 1971), 431. [14](ద్వితీయో. 6:8, 9) బహిరంగంగా ఉంచుకునే దానికంటెను ధర్మశాస్త్రము హృదయాలలో మనస్సులలో ఉంచుకొనడం ఉత్తమం (నిర్గమ. 13:9; ద్వితీయో. 11:18ఎ). [15]ఈ చమత్కారాన్ని నేను కనుగొన్నాను: "నీకంటే నేను ఆత్మ సంబంధిని యేలయనగా నా బాక్స్ నీదాని కంటే పెద్దది!". [16]ప్రభువు వస్త్రపు "చెంగును" ముట్టినట్టు మనం గతంలో చదివాం (మత్తయి 9:20; 14:36). [17]పరిసయ్యులను గూర్చి మాట్లాడునప్పుడు వారి "దీర్ఘ ప్రార్థనలను" గూర్చి లేఖనములోనుండి ఉదహరించు (మత్తయి 23:14; మార్కు 12:40). [18]పరిసయ్యులు సద్దూకయ్యులు వారి "బలమైన వస్త్రాలను" ధరిస్తారు. "బలమైన వస్త్రాలు" అనేది మా దేశములోని వాడుక. [19]J. W. McGarvey and Philip Y. Pendleton, *The Fourfold Gospel or a Harmony of the Four Gospels* (Cincinnati: Standard Publishing Co., 1914), 313. [20]ప్రభువు శిష్యులు ఆయనను "రబ్బీ" అని సంబోధించారు (మత్తయి 26:25; మార్కు 9:5; యోహాను 3:2).

[21]వినయమును గూర్చిన అవసరతను ప్రభువు మాట్లాడారు (11, 12 వచనాలు; మరియు మత్తయి 20:26, 27; మార్కు 10:43, 44). [22]తాను ఉపదేశించిన వారికి పౌలు ఆత్మసంబంధమైన తండ్రియన్నట్టు సూచించుకున్నాడు (1 కొరింథీ. 4:15) కాని "ఫాదర్ పాల్" అని పిలిపించుకోలేదు. [23]ఎనిమిదవమారు మత్తయి 23:14లో కనిపిస్తుంది. కొన్ని ప్రాచీన ప్రతులలో లేకపోయినను మార్కు మరియు లూకా అవి యేసు శపించిన మాటలలోనివేనని అంటారు. [24]David Smith, *Our Lord's Earthly Life* (New York: G. H. Doran, 1926), 353; quoted in H. I. Hester, *The Heart of the NewTestament* (Liberty, Mo.: Quality Press, 1963), 194. [25]Warren Wiersbe 84-86లో "శ్రమ" అనే దానిని "ధన్యుల"తో పోల్చి చెప్పాడు. [26]లూకా 11:52పై "క్రీస్తు జీవితం, 4"ను చూడు. [27]"విధవరాండ్ర యిండ్లను" పరిసయ్యులు ఎలా మింగారో మనకు తెలియదు. [28]Coy Roper, "Factors Contributing to the Origin and Success of the Pre-Christian Jewish Missionary Movement" (Ph.D. diss., University of Michigan, 1988), 20-49. [29]"స్వభావంలో పాలుపొందుటను" హీబ్రూ పద ప్రయోగం తెలుపుతుంది. అలాంటి భావాన్నే యాకోబు నాలుకను గురించి తెలుపునప్పుడు ఉపయోగించాడు (యాకోబు 3:6). [30]"క్రీస్తు జీవితం, 5"ను చూడు. రుచినివ్వడానికి మిన్ట్‌ను ఉపయోగిస్తారు.

[31]"బరువైనవి" అనే పద ప్రయోగమునకు "తేలికైన" మరియు "బరువైన" ఆజ్ఞలపై "విజేత … యింకను ఛాంపియన్" అనే పాఠములో యిచ్చిన వ్యాఖ్యానాన్ని చూడు. [32]"అంధులైన మార్గదర్శకులారా" అని ప్రభువు ఈ చర్చలో రెండు సార్లు వారిని సూచించారు (16, 24 వచనాలు) మత్తయి 15:14 చూడు. [33]మత్తయి 23:24 పై డేవిడ్ రోపర్‌గారి చర్చను చూడు. "Watch Out for the Camels!" *The Day Christ Came (Again) and Other Sermons* (Dallas: Christian Publishing Co., n.d), 161-74. [34]దీని విషయమై అతివ్యాప్తి ఉన్నా ప్రభువువారు ఒక్కొక్క దానిని విడమరచి చెప్పారు. [35]హేబేలు ఆది. 4:8లోను; జెకర్యా మరణం 2 దినవృ. 24:20–22లోను రాయబడియుంది. అంటే, పాతనిబంధన చరిత్ర ఆదినుండి అంతంవరకు గల నీతిమంతుల రక్తం విషయంలో [దోషులుగా] లెక్క చెప్పవలసినవారు? [36]34వ వచనానికి అపొస్తలుల కార్య గ్రంథం మంచి వ్యాఖ్యానమై యుంటుంది (2 కొరింథీ. 11:23). [37]మత్తయి 23:37–39లోని మాటలు యేసు పెరియాలో పలికినవే (లూకా 13:34, 35). [38]కోడి తన పిల్లలను రెక్కల క్రిందకి చేర్చుకొనుటను చూస్తాము కాని అనేక చోట్ల యువకులను చేర్చుకొనుట లేదు. మీ శ్రోతలకు ఇది వర్తిస్తే, ఈ సున్నిత విషయమును వివరించుటకు కొంత సమయమును వినియోగించాలి. [39]కీర్తన. 48:1, 8 చూడు. [40]38వ వచనాన్ని

యిర్మీయా 12:7తో పోల్చి చూడు.

[41]లూకా 19:41–44 పై వివరణను "క్రీస్తు జీవితం, 5"లో చూడు. తదుపరి పాఠాలలో యెరూషలేము నాశనమును గూర్చి చదువుతాం. [42]యోనా నీనెవే నాశనాన్ని గూర్చి ప్రకటించినా, వారు మారుమనస్సు పొందితే, దేవుడు వారిని కరుణించాడు (యోనా 3:4). ఆయన ఆ పట్టణాన్ని నాశనం చేయలేదు (యోనా 3:10). ఆయన కనికరముగల దేవుడు. [43]కీర్తనలు 118ని మెస్సీయ కీర్తన అంటారు (అపొ. 4:11). తొలి దినాల్లో క్రీస్తు కీర్తన 118:22ను ప్రస్తావించారు (మత్తయి 21:42), నాయకులు ఆయనను తిరస్కరిస్తారని ముందుగా ప్రవచింపబడింది. [44]మత్తయి 23:39 అస్పష్టమైనది. జడ్జిమెంటు (యెరూషలేం వినాశనాన్ని గురించి చెప్తుంది)లో నేను కనిపించేవరకు మీరు మరల నన్ను చూడలేరన్న అర్థాన్నివ్వవచ్చు. కీర్తన 118:26 ఎలాగైనా విశ్వాసనీయమైనది, అపనమ్మకమైనది కాదు. అందుకని నేను కీర్తనకు దృఢమైన వ్యాఖ్యానాన్నిచ్చాను. ఇదే సమయంలో మనం ఆ పట్టణానికొచ్చే విపరీత పరిస్థితిని తలంచుకోవాలి. యేసు ప్రతిపాదించిన స్థితిని పూర్తిగా నెలకొల్పే ఆశ మినుకుమంటోంది. ఈ కీర్తన చివర ఇలా చెప్తుంది. రాగల వేయి సంవత్సరాలలో ఏదో ఒకరోజు, యెరూషలేము ఆహ్వానాన్ని తెలుపుతుందనుకున్న సమయానికి యేసు భూలోకానికి రాగలరని అది చెప్పదు. "నీవు చెప్పేవరకు" అన్న వాక్యం సంశయాత్మకమైన సంభవమే కాని ఖచ్చితం కాదని, అది నెరవేరడం ప్రమాణ పూర్వకమైనది కాదని ఆర్. టి. ఫ్రాన్స్ రాసారు. 23వ అధ్యాయంలో ఆద్యంతం భవిష్యత్తులోని మారుమనస్సు కూడా సుదూరాంశమే అని వారు గుర్తించారు. 24వ అధ్యాయంలో రాగల జడ్జిమెంటుకు సంబంధించినది. ఇది ప్రవచనానికి (మత్తయి) కూడా వర్తిస్తుంది. మొత్తానికి ఇశ్రాయేలుల చివరి ఛాన్స్‌ను, ఆ నూతనమైన అంతర్జాతీయ దేవుని జనాన్ని గురించి మరల మరల చెప్తుంది (8:11–12, 12:38–45; 21:40–43; 22:7; 23:32–36; మొ.). అతని కోసం అనేదానితో మొదలైన కీర్తన 38 ప్రభువు తన ఇంటిని వీడి వెళ్లిపోవడానికి అనుసంధిస్తుంది. (ఆర్. టి, ఫ్రాన్స్ మత్తయి దృష్టిలో ప్రవచనం [Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985], 332-33); [45]ముగింపు అన్వయింపును పట్టి చేసాము. శ్రోతలకు సంబంధించిన వాటిని తెలియజేయి. [46]క్రైస్తవులు కాని వారు ఎలా ప్రత్యుత్తరమివ్వాలో తెలుపు (మార్కు 16:15, 16; అపో. 2:38), అవిశ్వాసులైన క్రైస్తవులు దేవుని వైపు ఎలా తిరగాలో తెలుపు (అపో. 8:22; 1 యోహాను 1:9; యాకోబు 5:16).